ఈనాడు నిర్మల్

ఆదివారం అక్టోబరు 20, 2024

ప్రసూతి మరణాలు తగ్గించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసూతి మరణాలు తగ్గించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వైద్యారోగ్యశాఖ అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన ప్రసూతి మరణాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తూ రక్తహీనత, పోషకాహార లోపాలను గుర్తించి అవసరమైన వారికి ఐరన్, కాల్షియం మాత్రలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని ఆసుపత్రుల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉండేలా చూడాలని, సీసీ కెమెరా నిఘాలో పర్యవేక్షించాలని చెప్పారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.రాజేందర్, వైద్యాధికారులు సురేశ్, సౌమ్య, వైద్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పంట అవశేషాలు

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే: రైతులు తాము పండించిన పంటను ఆరబోసుకునేందుకు ప్రధాన రహదారులను వాడుకోవటం బాగానే ఉన్నా.. పని పూర్తయిన తరువాత పేరుకుపోయిన పంట వ్యర్థాలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం ప్రధాన రహదారిపై ఎక్కడికక్కడ పంట వ్యర్థాలు అలాగే ఉండిపోయాయి. వీటిని ఎవరు తొలగిస్తారంటూ వాహనదారులు ప్రశ్నిస్తుంటే సమాధానం కరవైంది. అధికారులు స్పందించి రహదారులపై పేరుకుపోయిన చెత్తను తొలగించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


లక్ష్మణచాంద ప్రధాన మార్గంలో తారురోడ్డుపై పంట వ్యర్థాలు

జలకాలాట.. ఆరోగ్య బాట

✹ ఈతపై పెరుగుతున్న ఆదరణ ✹ ఇతర దేశాల్లో పాఠ్యాంశంగా బోధన


ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో ఈత కొలనులో చిన్నారుల సాధన

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం :

రోజూ ఈతకు వెళితే శరీరానికి చక్కటి వ్యాయామం అవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా ఇటీవల ఉమ్మడి జిల్లాలో ఈతకు ఆదరణ పెరుగుతోంది. కొన్ని ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో మినీ ఈత కొలనులు అందుబాటులో ఉంచి పిల్లలకు శిక్షణ ఇస్తున్నాయి. ఆరోగ్యంపై స్పృహ ఉన్నవారు నేర్చుకుంటున్నారు. వినోదాన్ని, ఆహ్లాదాన్ని పెంపొందించే ఈత విశ్వ క్రీడల్లో అత్యంత జనాదరణ పొందింది. ఇతర దేశాల్లో పాఠ్యాంశంగా బోధిస్తున్నారు. ఈతతో చేకూరే ప్రయోజనాలపై ప్రత్యేక కథనం.

ఉమ్మడి జిల్లాలో ఈత కొలనులు

- ఆదిలాబాద్: 3
- నిర్మల్ : 1
- కుమురం భీం: 1
- మంచిర్యాల 4

ఇతర దేశాల్లో..

ఇతర దేశాల్లో ప్రతి ఒక్కరికి ఈత తప్పనిసరిగా వచ్చి ఉండాలనే నిబంధన, చట్టం ఉంది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఈతలో శిక్షణ ఇస్తున్నారు.

✹ ఇంగ్లాండ్‌లోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు తప్పనిసరిగా ఈత నేర్పిస్తున్నారు. జాతీయ పాఠ్య ప్రణాళికలో శారీరక విద్య చట్టాన్ని పక్కాగా అమలు చేస్తున్నారు.

✹ ఆస్ట్రేలియాలో ఎక్కువగా బీచ్ సంస్కృతి ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈత నేర్పిస్తామని ధ్రువీకరణ పత్రం రాసి ప్రభుత్వానికి ఇవ్వాలని నిబంధన ఉంది.

✹ యూఎస్‌లోని పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతుల విద్యార్థులు ఈత నేర్చుకోవడం తప్పనిసరి చేసింది.

నాలుగు విధాలుగా ఈదవచ్చు. ఫ్రీ స్టైల్, బటర్‌ఫ్లై, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్.

బటర్‌ఫ్లై..



అత్యంత కష్టతరమైన ఈత బటర్‌ఫ్లై. నేర్చుకోవడానికి దాదాపు నెలరోజులు పడుతుంది. సీతాకోకచిలుక రెక్కలు ఆడించినట్లుగా రెండు చేతులతో నీటిని లాగుతూ ముందుకు కదలాలి. గంట బటర్‌ఫ్లై ఈత కొడితే 988 కెలరీలు ఖర్చవుతాయి.

బ్రెస్ట్ స్ట్రోక్..



నీటిలో కప్ప ఈదినట్లుగా ఉంటుంది బ్రెస్ట్ స్ట్రోక్ ఈత. రెండు కాళ్లతో నీటిని వెనక్కి నెట్టుతూ, రెండు చేతులు వేగంగా ఛాతి వైపు లాగుతూ ముందుకు వెళ్లే ప్రక్రియ. గంట పాటు సాధన చేస్తే 737 కెలరీలు ఖర్చవుతాయి.

ఫ్రీ స్టైల్..



దీనిని సంప్రదాయ ఈత అని కూడా అంటారు. రెండు వారాల్లో నేర్చుకోవచ్చు. గంట పాటు ఫ్రీ స్టైల్ విధానంలో ఈదితే 590-931 కెలరీలు ఖర్చు అవుతాయి.

బ్యాక్ స్ట్రోక్..



నేలపైన పడుకున్నట్లుగా నీటిపైన తేలుతూ ఈత కొట్టేదే బ్యాక్ స్ట్రోక్. రెండు నెలల్లో నేర్చుకోవచ్చు. ముఖం, కళ్లు ఆకాశం వైపు చూస్తూ శ్వాసను ఏకాగ్రతతో మెల్లగా వదలాలి, తీసుకోవాలి. ఈ క్రమంలో రెండు కాళ్లు చేతులతో నీటిని నెట్టాలి. గంట పాటు చేస్తే 500 కెలరీలు ఖర్చవుతాయి.

ఒత్తిడి దూరం..

- డా.క్రాంతికుమార్, ఎండీ జనరల్ ఫిజిషియన్



ఈత ఆరోగ్యానికి చాలా మంచిది. క్రమం తప్పకుండా రోజూ ఈత సాధనతో శరీరానికి మంచి వ్యాయామం లభిస్తుంది. శ్వాస సంబంధిత వ్యాధులు దరిచేరవు. హృదయ స్పందన నియంత్రణలో ఉంచుతుంది. శరీరంపైన ఒత్తిడిని తగ్గిస్తుంది.

ఉమ్మడి జిల్లాలో గడిచిన ఏడేళ్లలో ఈత రాక 86 మంది మృత్యువాత పడ్డారు.

● ఊబకాయం ఉన్నవారికి చక్కటి వ్యాయామం.

వీరు దూరంగా ఉండాలి : ఆస్తమా ఉన్నవారు, శస్త్ర చికిత్స అయిన వారు, చర్మ వ్యాధులతో బాధపడుతున్నవారు, అవయవ మార్పిడి చేసుకున్నవారు దూరంగా ఉండాలి

ఆసక్తి చూపుతున్నారు..: - కొమ్ము కృష్ణ, ఈత శిక్షకుడు, ఆదిలాబాద్




వేసవి సెలవుల్లో మాత్రమే ఈతకు వచ్చేవారు. ఇప్పుడు నేర్చుకునేవారి సంఖ్య పెరుగుతోంది. రోజూ ఉదయం, సాయంత్రం 50 మంది శిక్షణకు వస్తున్నారు. కొత్తవారు, సాధకులు తప్పనిసరి ఈత శిక్షకులు, నిపుణుల పర్యవేక్షణలోనే నీటిలోకి దిగాలి. పూర్తి పట్టు సాధించాక ఒంటరిగా 8 అడుగుల నీటి లోతులోకి వెళ్లాలి. ధైర్యం ఉన్నవారే ఈతలో రాణించగలుగుతారు.

ఇలా చేస్తే ప్రయోజనాలెన్నో..

● నాలుగు గంటల పాటు నడవడం వల్ల ఎన్ని కెలరీలు ఖర్చవుతాయో గంటపాటు ఈత కొట్టడంతో అంతకన్నా ఎక్కువ కెలరీలు ఖర్చు అవుతాయి.


● చక్కటి నిద్ర పడుతుంది.


● జీర్ణవ్యవస్థ మెరుగుపడి ఆకలి బాగా అవుతుంది.

● రక్తపోటు, మధుమేహం నియంత్రణలో ఉంటాయి.



● గుండె, ఊపిరితిత్తులు, రక్తప్రసరణ, మూత్రపిండాల పనితీరు మెరుగుపడుతుంది.


సమావేశంలో మాట్లాడుతున్న ఉపకులపతి గోవర్ధన్

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దుదాం


ముథోల్(బాసర), న్యూస్‌టుడే: సమన్వయంతో పనిచేసి విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దుదామని ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్ అన్నారు. విశ్వవిద్యాలయంలో శనివారం 13 విభాగాల అధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధ్యాపకుల ఇబ్బందులు, విద్యార్థుల సమస్యలపై చర్చించారు. తాను 24 గంటలు అందుబాటులో ఉంటానని, సమస్యలపై తనను సంప్రదించాలని పేర్కొన్నారు. సమస్యలపై తనకు నివేదిక అందజేయాలని కోరారు. అంతకు ముందు ఉపకులపతిని బోధనేతర సిబ్బంది, ల్యాబ్ ఉద్యోగులు కలిశారు. వారి సమస్యలను విన్నవించి సన్మానించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి రణధీర్, ఆయా విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

● ఉపకులపతిని నిజామాబాద్ జిల్లా ఎమార్పీఎస్ నాయకులు విశ్వవిద్యాలయంలో కలిశారు. విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యలను వివరించారు.

అమ్మవారిని దర్శించుకున్న ఉపకులపతి

ముథోల్(బాసర): బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారిని శనివారం ఆర్జీయూకేటీ ఉపకులపతి గోవర్ధన్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కుంకుమపూజ, మహాహారతి తదితర పూజలను నిర్వహించారు.

పంటల నమోదు తప్పులతడక



కుభీరు, న్యూస్‌టుడే:

ఆరుగాలం శ్రమించి పంటలను సాగుచేశారు. తమ భూముల్లో సాగుచేసిన పంటలను వ్యవసాయ విస్తరణాధికారుల వద్ద నమోదు చేసుకున్నారు. పంట దిగుబడులు ఇళ్లకు చేరుకున్నాయి. సోయాపంటకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. సోయాపంట సాగు వేసిన రైతుల జాబితా ప్రభుత్వ యాప్‌లో అందుబాటులో ఉంచింది. అందులో పేరుంటేనే సోయా కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడే తకరారు మొదలైంది. సోయా సాగుచేసిన రైతులు పత్తి సాగుచేసినట్లు, ఇంకొందరు సోయా పంటనే సాగు చేయనట్లు ప్రభుత్వ జాబితాలో నమోదైంది. కొనుగోలు కేంద్రంలో సోయా అమ్మడానికి ముందు కావాల్సిన పత్రాలు తీసుకొని కేంద్రాలకు వెళ్లిన రైతులకు ఆ జాబితాలో తమ పేర్లు కనిపించక తలలు పట్టుకుంటున్నారు. గత్యంతరం లేక వ్యాపారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. అధికారుల పనితీరుపై మండిపడుతున్నారు.

అంతా హడావుడి

పంటల నమోదులో ఏఈఓలు బాధ్యతారహితంగా వ్యవహరించటంతో రైతులు మద్దతు ధరకు దూరమయ్యారు. గడిచిన ఆగస్టు మాసం వరకు పంటల నమోదు చేపట్టారు. అంతలోనే ఏఈఓల బదిలీలు, రుణమాఫీ ప్రకియ కొనసాగింది. బదిలీపై వెళ్తున్నామని కొందరు ఏఈఓలు పంట నమోదులో ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే అదునుగా వ్యాపారులు మద్దతు ధరపై క్వింటాలుకు రూ.600 వరకు తక్కువకు అడుగుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. గడిచిన యాసంగిలోనూ కుభీరు మండలంలోని కొన్ని గ్రామాల్లో రైతులు జొన్న పంట సాగుచేయకున్నా, చేసినట్లు ఏఈఓలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.


కుభీరులో కొనుగోలు చేసిన సోయాను సంచుల్లో నింపుతున్న కూలీలు

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: రాఠోడ్ సుధాం, సిర్పెల్లి



10 బ్యాగుల సోయా పంటను సాగుచేశాను. పంటల నమోదులో ఏఈఓ బాధ్యతారహితంగా వ్యవహరించటంతో ఒక ఎకరమే సాగుచేసినట్లు రికార్డుల్లో నమోదైంది. ఎకరానికి ఆరు క్వింటాళ్ల సోయాలు విక్రయించటానికి విక్రయ కేంద్రానికి తెచ్చాను. మిగులు సోయాను వ్యాపారులకు అమ్మి నష్టపోయాను. ఏఈఓపై చర్యలు తీసుకోవాలి.

జాబితాలో నా పేరే లేదు: రాఠోడ్ కృష్ణ, సిర్పెల్లి తండా



సిర్పెల్లితండా శివారులోని నా భూమిలో ఐదు బస్తాల సోయా సాగుచేశారు. పంటను అమ్ముదామంటే ఆ జాబితాలో నా పేరు లేదు. దీంతో దళారులకు అమ్ముకోవాల్సిన అగత్యం ఏర్పడింది. జాబితాలో మార్పులు చేసి సాగుచేసిన పంటలను చేర్చాలి. రైతులకు న్యాయం చేయాలి.

డిజిటల్ సర్వేతో సమస్య దూరం: అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఈఓలపై శాఖాపరమైన చర్యలు చేపడుతాం. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా ప్రభుత్వం ఈ యాసంగిలోనే డిజిటల్ సర్వేతో పంటల నమోదు చేయాలని భావిస్తోంది. కానీ పని భారం పేరిట ఏఈఓలు డిజిటల్ సర్వేకు నిరాకరిస్తున్నారు.

పాఠశాలల్లో క్రీడా తరగతులు నిర్వహించాలి

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే: ప్రతి పాఠశాలలో సాయంత్రం ప్రత్యేకంగా క్రీడా తరగతులు నిర్వహించాలని డీఈఓ రవీందర్‌రెడ్డి సూచించారు. లక్ష్మణచాంద ఉన్నత పాఠశాలలో అండర్-14 జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభను ప్రదర్శించి పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. జిల్లాస్థాయి పోటీల్లో ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులు త్వరలో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో అశోక్‌వర్మ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రవీందర్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుడు రాజునాయక్, పేటా జిల్లా అధ్యక్షుడు బుక్యారమేష్, మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ ఈటల శ్రీనివాస్, మాజీ సర్పంచి ముత్యంరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఓస రాజేశ్వర్, వీడీసీ సభ్యుడు రాంరెడ్డి, ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో రవీందర్‌రెడ్డి

జోనల్‌స్థాయికి ఎంపికైన క్రీడాకారులు వీరే..

బాలుర విభాగంలో.. కె.తేజ, నందకిశోర్, అశ్విత్‌కుమార్, సాయికిరణ్ (రవి హైస్కూల్), డి.వెంకి(టీజీఎస్‌ఎన్‌ఆర్‌ఎస్, ముథోల్), అక్షిత్‌కుమార్, సృజన్, రుషివర్ధన్, అరవింద్ (జడ్పీహెచ్‌ఎస్, ఆష్టా), కరణ్(జడ్పీహెచ్‌ఎస్, లక్ష్మణచాంద), వర్షిత్ (ఉన్నత పాఠశాల, కడ్తాల్), రాజు(ఉన్నత పాఠశాల, పొన్కల్), రిశ్వంత్(ఉన్నత పాఠశాల, మాదాపూర్), జశ్వంత్(ఉన్నత పాఠశాల, ముజ్గి).

బాలికల విభాగంలో.. అంజలి, గంగాసాగర, శ్రీనిధి, దేవిక, అలేఖ్య, అశ్విత, నవ్యశ్రీ, వైష్ణవి(జడ్పీహెచ్‌ఎస్, ఆష్టా), శ్రీవిద్య, నవీనకుమారి (రవి హైస్కూల్, నిర్మల్), కీర్తన, గంగోత్రి (ఉన్నత పాఠశాల, లక్ష్మణచాంద), జ్యోత్స్న(జడ్పీహెచ్‌ఎస్, మల్లాపూర్), అలేఖ్య (ఉన్నత పాఠశాల, పొన్కల్), వర్షిత(ఉన్నత పాఠశాల, ముజ్గి).

అధిక మోతాదులో నత్రజని వాడితే అనర్థం

కుంటాల: అధిక మోతాదులో నత్రజని వాడితే పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ అన్నారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా కుంటాలలో శనివారం క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. మోతాదుకు మించి నత్రజని వినియోగిస్తే పంట ఉత్పత్తుల నాణ్యత సైతం దెబ్బతినడంతోపాటు మొక్కలు బలహీనంగా మారుతాయని పేర్కొన్నారు. భైంసా ఏడీఏ వీణ, ఏఓ విక్రమ్, ఏఈఓలు గణేష్, హర్షిత, శ్రీనివాస్, సీఆర్పీ, రిలయన్స్ ఫౌండేషన్ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బంకుల్లో నిబంధనలు పాటించాలి

లోకేశ్వరం, న్యూస్‌టుడే: పెట్రోల్ బంకుల యజమానులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని రాయపూర్ కాండ్లి బస్టాండు సమీపంలోని పెట్రోల్ బంకును శనివారం ఆయన తహసీల్దార్ మోతీరాంతో కలిసి తనిఖీ చేశారు. శుక్రవారం రాత్రి ఓ వినియోగదారుడు సీసాలో పెట్రోల్ పోయించుకోగా తక్కువగా వచ్చిందని ఫిర్యాదు మేరకు తనిఖీ చేసినట్లు వెల్లడించారు. వినియోగదారుల ముందు పెట్రోల్ కొలత సరిచూడగా తేడాలేమీ రాలేదని డీఎస్‌ఓ పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

నిర్మల్: పట్టణ శివారులోని సోఫినగర్ ఇందిరమ్మ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పరిశీలించారు. రహదారికి ఇరువైపులా మురుగు కాలువల పనులు చూశారు. దశల వారీగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.

భళా.. కళా ఉత్సవ్


నిర్మల్ జేవీఎన్‌ఆర్ పాఠశాల విద్యార్థినుల నృత్యం

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్-2024 పోటీలు ఆకట్టుకున్నాయి. శనివారం నిర్మల్ పట్టణం శాంతినగర్‌లోని జేవీఎన్‌ఆర్ విద్యాలయంలో వీటిని చేపట్టారు. డీఈవో రవీందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. చదువుతోపాటు కళలపైనా ఆసక్తి అవసరమన్నారు. నైపుణ్యం ఉన్న కళల్లో రాణించేందుకు సాధన చేయాలని చెప్పారు. 9, 10, 11, 12 తరగతులు చదివే విద్యార్థులకు ఆరు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ విద్యాలయాలకు చెందిన వారు హాజరై తమ ప్రదర్శనతో భళా అనిపించారు. అనంతరం డీఈఓ విజేతలకు ధ్రువపత్రాలు అందజేశారు. విద్యాశాఖ జిల్లా సమన్వయ కర్త వి.నర్సయ్య, పరీక్షల సహాయ కమిషనర్ సిద్ధ పద్మ, జిల్లా సైన్స్ అధికారి కె.వినోద్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ మణికుమారి, న్యాయ నిర్ణేతలు నవ్య, నాగరాజు, విశ్వనాథ్‌వర్మ, పోతన్న, రఫీక్, ఎర్రన్న, దేవిప్రియ, వనజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలు..

✦ జానపద నృత్యం, గీతం: సోఫీనగర్ తెలంగాణ రాష్ట్ర గురుకుల బాలికల విద్యాలయం

✦ సంగీత వాయిద్యం: గాయత్రి, అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలు

✦ సోఫీనగర్ తెలంగాణ రాష్ట్ర గురుకుల బాలికల విద్యాలయం విద్యార్థినులు మనీష ఏకపాత్రాభినయంలో, జి.శ్రీజ చిత్రలేఖనంలో, అనుదీప్తి కథ రచన విభాగంలో విజేతలుగా నిలిచారు.


తబలా వాయిస్తున్న అల్ఫోర్స్ కళాశాల విద్యార్థిని గాయత్రి

సమాచారం లేకుండానే పోటీలపై ఫిర్యాదు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: తైక్వాండో జిల్లా అసోసియేషన్‌కు, తనకు ఎలాంటి సమాచారం లేకుండానే ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 13న తైక్వాండో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారని ఆ క్రీడా అసోసియేషన్ జిల్లా బాధ్యుడు, జాతీయ క్రీడాకారుడు ద్యాయత్ అక్షయ్ పేర్కొన్నారు. శనివారమిక్కడ ఆయన విలేకరులతో మాట్లాడారు. దీనిపై కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. అసోసియేషన్ బాధ్యుడు సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని చాక్‌పల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముస్కు పోసాని (80)కి డొంగుర్‌గాం గ్రామానికి చెందిన గంగసాగర, గంగవ్వ, మంజులతో వ్యవసాయ భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ కారణంగా ఆ భూమి పంట వేయక వృథాగా ఉంది. దీంతో మనస్తాపం చెందిన పోసాని ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. తిరిగి రాకపోవడంతో వెదకగా ఎర్రగుంటలో శవమై కనిపించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ హన్మాండ్లు తెలిపారు.

✹ పేండ్‌పెల్లి గ్రామాభివృద్ధి సమితి కల్యాణ మండపంలో ఐదేళ్లుగా స్టీల్ బ్యాంకును కొనసాగిస్తుండటం విశేషం. గ్రామస్థులు సైతం అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ముందుకెళ్తున్నారు. శుభకార్యాలను ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు చర్యలు చేపడుతూ బంధువులు, స్నేహితుల్లో స్ఫూర్తిని నింపుతున్నారు.

✹ వానల్‌పాడ్‌లో కొనసాగిన దసరా నవరాత్రి జాతర ఉత్సవాల్లో స్టీల్ వాడకాన్ని విస్తృతం చేశారు. వేలాది మంది భక్తులకు భోజనానికి స్టీల్ ప్లేట్, గ్లాసు అందజేశారు. తదుపరి శుభ్రం చేసి అక్కడ ఏర్పాటు చేసిన స్టాండ్‌లో పెట్టాల్సి ఉంటుంది. వేలాదిగా పేపరు ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసుల వాడకం తగ్గిందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

✹ మాటేగాంలో ఇటీవల కొనసాగిన గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో పర్యాటకుల తాకిడికి తగ్గట్టుగా స్టీల్ బ్యాంకును ఏర్పాటు చేశారు. వివిధ జిల్లాలు, మహారాష్ట్ర నుంచి వచ్చిన వేలాది భక్తులను ఆలోచింపజేసేలా చర్యలు చేపట్టారు.

స్టీల్ బ్యాంకుల దిశగా అడుగులు!

● నిషేధిత ప్లాస్టిక్ మహమ్మారి నిర్మూలనకు చర్యలు

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: జీవకోటి మనుగడకు ప్రశ్నార్థకంగా మారిన ప్లాస్టిక్ మహమ్మారిని నిర్మూలించేందుకు గ్రామాల్లో పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు గ్రామాల్లో అన్నప్రసాద వితరణలో స్టీల్ ప్లేట్లు, గ్లాసులు వాడారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపిక చేసిన పంచాయతీల్లో కార్యదర్శులు స్టీల్ బ్యాంకులను అందుబాటులో తీసుకొచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ముందుగా మండలంలోని ఇలేగాం, సుంక్లి, వానల్‌పాడ్, చింతల్‌బోరి గ్రామాల్లో ప్రక్రియ చేపట్టారు. ఇందుకు 15 ఆర్థిక సంఘం నిధులతో జనాభా ప్రతిపాదికన వాటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా పలు గ్రామాలను ఎంపిక చేసి సత్ఫలితాలు సాధిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

☛ ప్లాస్టిక్ భూతాన్ని నివారించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టినప్పటికీ ప్రజల్లో చైతన్యం అంతంత మాత్రమే. దుకాణాల్లో ప్లాస్టిక్ సంచులు, పేపర్ ప్లేట్లు, గ్లాసులు ఇలా అనేక రకాల ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. యంత్రాంగం సైతం తూతూమంత్రంగానే చర్యలు చేపట్టి చేతులు దులుపుకొంటుందనే విమర్శలున్నాయి. శుభకార్యాలకు, పండగలు, అన్నప్రసాద వితరణలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాల్సిన అవసరముంది. వేడివేడి వంటకాలతో భోజన చేసే క్రమంలో ప్లాస్టిక్ పేపరు ప్లేట్లలో ఉండే రేణువులు శరీరంలోకి వెళ్తాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తే వీలుందనే సమాచారాన్ని విస్తృతం చేస్తున్నారు. జిల్లాలో మొదటగా వానల్‌పాడ్ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకును పరిశీలించిన పాలనాధికారి అభిలాష అభినవ్ గ్రామస్థులను ప్రత్యేకంగా అభినందించి ఆ స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని సూచించారు.


పేండ్‌పెల్లిలో స్టీల్ ప్లేట్లు, గ్లాసులతో అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో వరుస కట్టిన గ్రామస్థులు

తాటిచెట్టుపై పిడుగుపాటు


పిడుగుపాటుకు చెలరేగుతున్న మంటలు

హాజీపూర్, న్యూస్‌టుడే : మండలంలో శనివారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, పిడుగులతో కురిసిన అకాల వర్షానికి ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని పెద్దంపేటలో బొప్పు ఎల్లయ్య ఇంటి సమీపంలో ఓ తాటిచెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగడంతో గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. పిడుగు పడే సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కాగా మండలంలోని పెద్దంపేట, దొనబండ, టీకనపల్లి, హాజీపూర్ తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.

చెరువా.. తామర వనమా



తోటలో పూల సాగు చేసినట్లు కనిపిస్తున్న ఈ దృశ్యం కడెం మండలం కన్నాపూర్ చెరువులోనిది. ఇక్కడి చెరువు నిండా తామరపూలు పూస్తున్నాయి. ఇటీవల దేవీ నవరాత్రులు, బతుకమ్మ పండగకు చాలామంది ఇక్కడి తామరపూలను కోసుకెళ్లారు. చెరువులో ఇలా రోజూ పూలు పూస్తుండటంతో తామర పూల తోటలా కనిపిస్తోంది. నిర్మల్-మంచిర్యాల రహదారిని ఆనుకుని ఉన్న ఈ చెరువులోని తామరలు కనువిందు చేస్తున్నాయి. **- కడెం, న్యూస్‌టుడే**

కల్లు గీతకు తి(తె)ప్పలు


తెప్పపై వెళ్లి కల్లుగీయడానికి చెట్టు ఎక్కుతున్న గీతకార్మికుడు

ధర్మకోల్ తెప్పలతో సాధారణంగా గంగపుత్రులు చేపల వేట కొనసాగిస్తారు. కానీ నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం బన్నపల్లి శివారులోని గోదావరి నది శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వెనుక జలాలు సమీపంలో కొన్ని తాటి, ఈత చెట్లు జలమయం కావడంతో కల్లుగీత కార్మికులు తెప్పల సాయంతో కల్లు సేకరించి జీవనోపాధి పొందాల్సి వస్తోంది. ఏటా గోదావరి జలాలు పూర్తిస్థాయిలో నిండటంతో నీరు తగ్గేవరకు సముందర్‌పల్లి, గుండంపల్లి, టెంబుర్ని గ్రామాల్లోని పలువురు గీతకార్మికులు చెట్ల వద్దకు వెళ్లడానికి తప్పనిసరిగా తెప్పలు వాడాల్సి వస్తోంది.

- న్యూస్‌టుడే, దిలావర్‌పూర్


బన్నపల్లిలో తెప్పపై కల్లుకుండతో వస్తూ...

రైతు బిడ్డలు.. వ్యవసాయాధికారులు

● కర్షకుల ఇంట కొలువుల పంట

మామడ, న్యూస్‌టుడే: వ్యవసాయమే ఆధారంగా జీవించే రైతుల పిల్లలు ప్రయోజకులై కొలువులు సాధిస్తే అంతకు మించిన ఆనందం ఇంకొకటి ఉండదు. అనేక ప్రతికూల పరిస్థితులను తట్టుకొని ఏడాదికి ఒకటి రెండు పంటలు పండించే కుటుంబాల్లో నేలకో దిగుబడి వస్తే ఎంతో ఆనందంగా ఉంటుంది. ఇటీవలే విడుదలైన ఫలితాల్లో చేరిన ఈ యువ వ్యవసాయాధికారులది పక్కా కర్షక కుటుంబం. బాల్యం నుంచే తల్లిదండ్రులతో పాటు సాగు పనులు చేసిన అనుభవం వారిది. పాతికేళ్ల వయసులోనే రెండు మూడు ఉద్యోగాలు సాధించి ఇప్పుడు ఏకంగా ఓ మండలానికి అధికారిగా గెజిటెడ్ హోదా పొందిన ఇద్దరు యువకుల నేపథ్యమిది...


వ్యవసాయ పనులలో నవీన్ తల్లిదండ్రులు బిక్కు-కళ


తల్లిదండ్రులు నర్సవ్వ-మాణిక్‌రావుతో పొలం పనుల్లో గిరిరాజ్

తండా కుర్రోడే తడాఖా..

మామడ మండలం లింగాపూర్ తండాకు చెందిన సూరావత్ బిక్కు-కళ దంపతుల కుమారుడు నవీన్. ప్రస్తుతం ఈయన పెంబి మండల వ్యవసాయాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ఏజీ బీఎస్సీ మొదటి సంవత్సరంలోనే అనారోగ్యం వల్ల చదువుకు ఆటంకం కలిగింది. డిగ్రీ పూర్తయ్యేందుకు ఓ ఏడాది ఆలస్యమైంది. ఈ క్రమం ఆయనను కొంత కుంగుబాటుకు గురిచేసింది. ఆత్మవిశ్వాసం కూడగట్టుకొని పట్టు సడలనివ్వకుండా ముందుకు సాగి మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. ఆ వెంటనే బ్యాంకు ఉద్యోగాల కోసం శిక్షణకు వెళ్లారు. అనేక పోటీ పరీక్షలు రాశారు. తొలి ఉద్యోగం యూనియన్ బ్యాంకులో గ్రామీణాభివృద్ధి అధికారిగా ఆంధ్రప్రదేశ్‌లో వచ్చింది. ఆ తర్వాత ఏపీపీఎస్సీ మండల హోదా గల అధికారిగా ఎంపికైనా బ్యాంకు కొలువులోనే కొనసాగారు.

నవీన్ ఏమంటున్నారంటే..




చిన్నప్పటి నుంచి అమ్మానాన్నల కష్టం చూశాను. రెక్కలు ముక్కలు చేసుకొని చదివించారు. ఎలాగైనా వారి కష్టాలను గట్టెక్కించాలన్న కసితో ముందుకెళ్లాను. పోటీ పరీక్షల్లో రాణించాలంటే సాదాసీదా ప్రయత్నాలతో పని కాదు. పట్టుదల, ప్రణాళిక చాలా ముఖ్యం. సమయం ఎంతో కీలకం. ఎక్కడా వృథా చేయొద్దు. ఏ పరీక్ష రాసినా పాత ప్రశ్నాపత్రాల సాధన బాగా చేయాలి. పెద్ద లక్ష్యం పెట్టుకుంటే ఏదో ఒకటి తప్పకుండా సాధించొచ్చు.

పట్టుదలే పెట్టుబడిగా..

దిలావర్‌పూర్‌కు చెందిన నర్సవ్వ-మాణిక్‌రావు దంపతుల కుమారుడు గిరిరాజ్ తాజాగా లోకేశ్వరం వ్యవసాయాధికారిగా నియామకమయ్యారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఏజీ బీఎస్సీ పూర్తి చేశారు. కేరళ వ్యవసాయ శాఖలో పీజీ చేసేందుకు అవకాశం వచ్చినా ఉద్యోగం సాధించాలన్న తపనతో అనేక పోటీ పరీక్షలు రాశారు. ఇప్పటికే మేనేజరుగా ఎంపికై గద్వాలలో పనిచేశారు. ఇంకా మంచి స్థానానికి చేరుకోవాలన్న లక్ష్యంతో గ్రూప్స్, ఎస్సై ఎంపిక పరీక్షలకు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలో ఏవో ఉద్యోగం సాధించి వ్యవసాయాధికారి అయ్యారు.

విజయానికి దగ్గరి దారులు ఉండవు: గిరిరాజ్



తల్లిదండ్రులు ఉద్యోగులైతే ఆర్థికంగా అంత ఇబ్బందులుండవు. పరిస్థితులు అనుకూలిస్తాయి. రైతు కుటుంబాలకు కష్టం భారమే అవుతుంది. ఈ పరిస్థితులను దగ్గరగా చూసి ఎలాగైనా ప్రయోజకుడినై అమ్మానాన్నలను సంతోష పెట్టాలన్న తపన నిత్యం మదిలో మెదిలేది. ఏదైనా సాధించే వరకు ప్రయత్నం ఆపొద్దన్న లక్ష్యం పెట్టుకున్నాను. ఏ విజయం సాధించాలన్నా దానికి దగ్గరి దారులంటూ ఏవీ ఉండవు. నిరంతర ప్రయత్నంతోనే ఫలితం వస్తుంది. చాలా మంది ఉద్యోగ ప్రకటన విడుదలయ్యాకే చదవడం మొదలు పెడుతారు. ఎంతో మంది ప్రతిభావంతులున్న ఈ పోటీ ప్రపంచంలో పైపై ప్రయత్నాలతో విజయం కష్టమే.. ఎస్సై, గ్రూప్స్‌కు ముందు నుంచే సన్నద్ధం కావడంతో ఆ పరిజ్ఞానం ఏవో పరీక్షలో నాకు ఉపయోగపడింది.

ఆలోచనలు పరుగెత్తేలా.. నడిచే ప్రయోగశాల

● ప్రత్యేకంగా కుమురంభీం జిల్లా విద్యార్థులకు కేటాయింపు

న్యూస్‌టుడే, ఆసిఫాబాద్ అర్బన్

శాస్త్ర సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న ప్రస్తుత రోజుల్లో పాఠశాల నుంచే విద్యార్థుల్లో ఆ ఒరవడి సృష్టించాల్సిన అవసరముంది. వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగశాలలు ఆశాజనకంగా లేకున్నా.. అత్యాధునిక వసతులు, పరికరాలతో కూడిన సంచార సైన్స్ ల్యాబ్ వాహనాన్ని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) సంస్థ కుమురంభీం జిల్లాకు ప్రత్యేకంగా సమకూర్చింది. గదుల్లో నేర్చుకున్న భౌతిక, రసాయన సిద్ధాంతాలు, వివిధ సూత్రాలను ప్రయోగాలతో అవగాహన కలిగించే అవకాశం ఉండటంతో.. విద్యార్థులకు ఇది ఎంతో ఉపయుక్తంగా మారనుంది. మంత్రి సీతక్క ఈ నెల 16న ఆసిఫాబాద్‌లో దీన్ని ప్రారంభించారు.

రూ.80 లక్షలతో ఈ సంచార వాహనాన్ని అత్యాధునికంగా తీర్చిదిద్దారు. సెంట్రల్ ఏసీ, ప్రొజెక్టర్, స్క్రీన్, జనరేటర్, శౌచాలయంతో పాటు పాఠశాలల్లోని ల్యాబ్‌లకు భిన్నంగా ప్రయోగ పరికరాల ప్రదర్శన, భద్రపరిచే ఏర్పాట్లు ఉన్నాయి. తెలిసిన విషయాలనే వివిధ పరికరాలతో ఆసక్తికరంగా చూపిస్తూ విద్యార్థుల్లో తెలుసుకోవాలన్న ఆలోచన కలిగేలా పొందుపర్చారు. అయితే ఈ వాహనానికి డ్రైవర్, హెల్పర్, ఇంధనం తదితర ఖర్చుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంది.


సంచార సైన్సు ప్రయోగశాల బస్సు


సంచార సైన్సు ప్రయోగశాలలో భౌతిక, జీవ, గణితశాస్త్రాల ప్రయోగాలు, నమూనాలతో సైన్సు విషయ నిపుణులు

మ్యాజిక్ మయం..

వాహనంలో మ్యాజిక్ తలపించే ప్రయోగాల ప్రదర్శన ఆకట్టుకుంటుంది. మ్యాజిక్ వాటర్ ట్యాప్, న్యూటన్ ఊయల, జడత్వ నియమం, చర్య ప్రతిచర్య, పంజరంలో చిలుక, గుర్రపు చట్రం, పీడన చట్రం, గాలిలో అయస్కాంతం, తదితర భౌతిక, రసాయన, జీవ, గణిత ప్రయోగాలు అద్భుత భావనలు దృశ్య భ్రాంతిని కలిగిస్తాయి.

మ్యాజిక్ వాటర్ ట్యాప్



ఎలాంటి ఆధారం లేకుండానే కుళాయి ఏర్పాటు, అందులోంచి నీరు కిందకు పడుతున్నట్లు కనిపించే ఈ మ్యాజిక్ వాటర్ ట్యాప్ ఆసక్తి కలిగిస్తుంది.

న్యూటన్ ఊయల

వేలాడదీసిన లోలక గుండ్లలో.. ఒక దాన్ని లాగి వదిలితే అవతలి వైపున్న ఒక గుండు అంతే వేగంతో కదులుతుంది. మిగతావి కదలవు. అలానే రెండు, మూడు లాగి వదిలినా.. సమాన సంఖ్యలో అవతలి గుండ్లు కదులుతాయి. న్యూటన్ నియమాల ఆధారంగా ఇది పనిచేస్తుంది.




పీడన చట్రం

చిలుక, గుర్రం..

ఒక చట్రం పైభాగాన ఓ వైపు చిలుక చిత్రం, మరోవైపు పంజరం చిత్రాన్ని ఉంచి చట్రాన్ని గిరగిరా తిప్పితే.. పంజరంలో చిలుక ఉన్న భ్రాంతి కలుగుతుంది. అలాగే చట్రంలోని గుర్రపు బొమ్మ సైతం తిప్పినపుడు ముందుకు పరుగెడుతున్నట్లు కనిపిస్తుంది.



ముందుగా ఉపాధ్యాయులకు శిక్షణ

- కటుకం మధుకర్, జిల్లా సైన్సు అధికారి



సంచార ప్రయోగశాల జిల్లాకు కేటాయించడం అభినందనీయం. అత్యాధునిక భావనలు, సౌకర్యాలతో ఉన్న ఈ ప్రయోగశాలను జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల వద్దకు తీసుకుపోయి వీలైనంత త్వరగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తాం. ముందుగా సైన్సు ఉపాధ్యాయులకు దీనిపై శిక్షణనిస్తాం. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం.

వేడి పుట్టించవు.. మంటలు రావు



వీధి దీపాల్లా కనిపిస్తున్న ఈ లైట్లు సాధారణమైనవి కావు. సాధారణ వీధి దీపాలు వేడిని పుట్టిస్తాయి. ఆదిలాబాద్ జైలు బంకు సమీపంలో త్వరలో ప్రారంభించనున్న సీఎన్‌జీ గ్యాస్ స్టేషన్ వద్ద జిల్లాలోనే మొదటి సారి ఈ అన్‌ఫ్లేమ బుల్ లైట్లను ఏర్పాటు చేశారు. ఇవి సాధారణ దీపాలకు భిన్నంగా ఉంటాయి. వీటి వల్ల అక్కడ ఉష్ణోగ్రతలు పెరగవు. ఒక్కోదానికి రూ.5,500 ఉంటుంది. సీఎన్‌జీ గ్యాస్ పంపుల వద్ద వీటిని ఏర్పాటు చేస్తారు. ఒక వేళ పొరపాటున గ్యాస్ లీక్ అయినా మంటలంటుకోవు.

- ఈనాడు, ఆదిలాబాద్ - న్యూస్‌టుడే, ఆదిలాబాద్ నేర విభాగం

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు లక్ష్మణ్‌సాయి



మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే : పాఠశాల క్రీడా సమాఖ్య జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారుడు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన జిల్లా, రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో మెరుగైన ఆటతీరును కనబరుస్తూ నిలకడగా రాణిస్తున్న వేములపల్లి లక్ష్మణ్‌సాయి తెలంగాణ జట్టులో చోటు దక్కించుకున్నాడు. త్వరలో బిహార్‌లో జరగనున్న ఆయా పోటీల్లో పాల్గొననున్నాడు. లక్ష్మణ్ ప్రస్తుతం మంచిర్యాల కేంద్రీయ విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతుండగా స్థానిక గురు క్రికెట్ అకాడమీలో శిక్షకుడు దుర్గాప్రసాద్ సమక్షంలో శిక్షణ తీసుకుంటున్నాడు.

మొలకలు.. కాస్త భిన్నంగా


కాస్త రుచికరంగా ఇలా సిద్ధం చేస్తూ..



న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ: ఆరోగ్యకరమైన అలవాట్లను జిల్లా కేంద్రానికి పలువురు రోజుకో రకంగా పరిచయం చేస్తున్నారు. ఇటీవల కాలంలో గ్రీన్, లెమన్, బెల్లం టీ, చిరుధాన్యాల జావ ఇలా అనేక రకాల ఆరోగ్యాన్ని పెంచే కేంద్రాలను అందుబాటులో తీసుకొచ్చారు. ప్రజలు సైతం వీటిని తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం మంచిర్యాల పట్టణానికి మరోరకం ఆరోగ్యకరమైన ఆహారాన్ని తాగేది కాకుండా తినే పదార్థం వినియోగంలోకి తీసుకొచ్చారు. చెన్నూరుకు చెందిన రాజు అనే యువకుడు కాస్త వినూత్నంగా పరిచయం చేస్తున్నాడు. హెల్తీ, స్పైసీ మొలకలంటూ కాస్త భిన్నంగా అప్పటికప్పుడు సిద్ధం చేసి అందిస్తున్నారు. హంగు, ఆర్భాటాలు లేకుండా మిర్చి బండి మాదిరిగా ఏర్పాటుచేసి జిల్లావాసుల ఆరోగ్యాన్ని పంచు(పెంచు)తున్నారు.

మొలకలు (ఉలవలు, మొక్కజొన్న, పెసర్లు, ఎర్ర పెసర్లు, బబ్బర్లు, శనగలు, పల్లీలు) ఆరోగ్యానికి మంచిదంటారు. కొంతమంది వీటితోనే దినచర్య ప్రారంభిస్తారు. ఎప్పటినుంచో అందుబాటులో ఉన్నా ప్రస్తుతం ఆరోగ్యకరమైన అలవాట్లు పెరగడంతో వీటికీ మరింత ప్రాధాన్యం పెరిగింది. కొందరు కాస్త ఓపికతో వారివారి నివాసాల్లోనే విత్తనాలను రాత్రి నానబెట్టి మొలకెత్తిన అనంతరం పచ్చివే ఉదయం తింటుంటారు. వీటిని తినడం ఆరోగ్యానికి మంచిదే అని తెలిసినా పచ్చివి తినాలంటే కొంతమంది ఇబ్బంది పడుతుంటారు. వారి కోసమే ఈ బండిని అందుబాటులోకి తీసుకొచ్చినట్లుగా ఉంది. వేసివేయనట్లుగా నూనె, కాస్త ఉప్పు, కారంతో ఫ్రై చేస్తున్నారు. చివరగా కొంత నిమ్మరసం కలిసి ఆహా అనేలా రుచికరంగా సిద్ధం చేసి విక్రయిస్తున్నారు.

ఏటా గండ్లు.. తప్పని కడగండ్లు

● సరస్వతి కాలువపై అధికారుల శీతకన్ను

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే: శ్రీరాంసాగర్ జలాశయం నుంచి ప్రవహించే సరస్వతి కాలువను తూర్పు జిల్లా వరప్రదాయనిగా పిలుస్తారు. వర్షాకాలం ప్రారంభమై భారీ వరద వస్తే గండ్లు పడి ప్రమాదకరంగా మారుతోంది. ఏటికేడు గండ్లు పడుతుండటంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. పంట పొలాల నుంచి ప్రవహించే నీరు.. ఎగువ ప్రాంతాల నుంచి కాలువ వైపు దూసుకువచ్చే నీటితో కాలువ ప్రమాదానికి గురవుతోంది. మూడు సంవత్సరాలుగా వరుస పెట్టినట్లు అధికారులు చర్యలు చేపట్టిన ప్రదేశాల్లోనే తరచూ కాలువ గట్లు కోతకు గురై గండ్లుగా మారుతున్నాయి. కొన్ని చోట్ల పదేపదే కోతకు గురవుతుండటం అధికారులకు తలనొప్పిగా మారింది. ఏటి కేడు పడుతున్న గండ్లపై పరిశీలన కథనం.

కాలువ వివరాలు..

ఆయకట్టు: 33వేల ఎకరాలు
కాలువ ప్రవాహం: 42 కి.మీ.
ఉపకాలువలు: 28

కాలువ ప్రవహించే మండలాలు: సోన్, నిర్మల్, లక్ష్మణచాంద, మామడ, ఖానాపూర్, కడెం, పెంబి.


రాచాపూర్ సమీపంలో గత ఏడాది పడిన గండి

ప్రమాదకరంగా ఉన్న ప్రదేశాలు..

- సోన్ మండలంలోని న్యూవెల్మల్ సమీపంలో ప్రధాన కాలువకు ఎగువ భాగం నుంచి నీరు వస్తుండటంతో గండి పడుతోంది. మూడేళ్లుగా ఒకే ప్రదేశంలో గండ్లు పడుతున్నాయి.
- న్యూవెల్మల్ రాచాపూర్ మార్గంలో కోతకు గురైన ప్రదేశంలో తాత్కాలికంగా మట్టి పోశారు. శాశ్వత చర్యలు చేపట్టకపోతే మళ్లీ గండి పడే అవకాశం ఉంటుంది.
- రాచాపూర్ సమీపంలో సాగు నీటి కాలువ ప్రవహించేలా ఏర్పాటు చేసిన ప్రదేశంలో రెండేళ్ల కిందట గండి పడింది. వంతెన ప్రమాదకరంగా మారింది.
- డీ-16 ఉపకాలువకు పలు చోట్ల గండ్లు పడగా.. చాలా చోట్ల కోతకు గురైంది.
- వడ్యాల్ సమీపంలో కాలువ కోతకు గురికాగా.. తాత్కాలికంగా మట్టిని పోశారు. శాశ్వత చర్యలు చేపడితేనే ప్రయోజనం.
- బాబాపూర్ సమీపంలో గతేడాది భారీ వర్షాలకు కాలువకు గండి పడింది. మళ్లీ వరద పోటెత్తితే కాలువకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
- నిర్మల్ రూరల్ మండల పరిధిలో గతంలో రెండు సార్లు కాలువకు గండ్లు పడి నీరంతా వృథాగా పోయింది.
- అనేక ఉపకాలువలు భారీ వరదల సమయంలో ప్రమాదకరంగా మారాయి.
- వడ్యాల్ సమీపంలో మాటు కాలువ వంతెన కూలిపోవటంతో నీరంతా కాలువలో వృథాగా పోతుంది.

అపరిచితులకు వివరాలు చెప్పొద్దు

కుంటాల, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సైలు దేవ్‌రావు, రాందాస్ సూచించారు. మండలంలోని వెంకూర్‌లో శనివారం అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు, ఆధార్ వివరాలు, ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పమంటే తిరస్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని పేర్కొన్నారు. సూచనలు చేస్తూ సందేహాలను నివృత్తి చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా...

నిర్మల్ 97053 46693
భైంసా 63099 94649
ఖానాపూర్ 96401 62091

?: భైంసా మండలం సుంక్లిలోని ప్రధాన రహదారిపై మిషన్ భగీరథ పైపు పగిలి నీరు వృథాగా పోతోంది. - సుంక్లి వాసులు
✓: క్షేత్ర స్థాయిలో సమస్య పరిశీలించి పరిష్కరిస్తాం.
- కమల్ ఏఈఈ, భైంసా
-న్యూస్‌టుడే, లోకేశ్వరం

?: సేవాలాల్‌తండా పంచాయతీలో లోఓల్టేజీ సమస్యపై డిస్కం అధికారులకు విన్నవించినా పరిష్కారం కావడం లేదు. -ఉత్తం, సేవాలాల్‌తండా
✓: నియంత్రిక తెప్పించాం. దసరా రోజు పక్క గ్రామంలో నియంత్రిక చెడిపోతే అక్కడికి సర్దుబాటు చేశాం. వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. -శివకుమార్, డిస్కం ఏఈ -న్యూస్‌టుడే, భైంసా గ్రామీణం

అలా నాటడం.. ఇలా నరకడం


కన్నాపూర్ వద్ద దారిపక్కన తీగల కింద ఉన్న చెట్లను నరికేస్తున్నారిలా

కడెం, న్యూస్‌టుడే: పంచాయతీ పాలకవర్గాలకు ఇచ్చిన లక్ష్యం మేరకు రహదారుల వెంట మొక్కలు నాటుతున్నారు. అందులో చాలా వరకు విద్యుత్తు లైన్ల కిందనే ఉంటున్నాయి. ఏపుగా ఎదిగిన చెట్లతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగిస్తాయని విద్యుత్తు అధికారులు నరికివేస్తున్నారు. తీగలకింద మొక్కలు నాటొద్దని చెబుతున్నా పంచాయతీ అధికారులు గ్రామాల్లో మళ్లీ మళ్లీ అలాగే నాటుతున్నారు. వీళ్లేమో ఇలా నరికేస్తుండడం పరిపాటిగా మారుతోంది. మొక్కలు నాటి సంరక్షించడానికి, వాటిని నరకడానికి ఇలా రెండు సార్లు ప్రజాధనం దుర్వినియోగం తగదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తీగలకింద మొక్కలు నాటకుండా చర్యలు తీసుకోవాలని, ఒకవేళ నాటినా తక్కువ ఎత్తు పెరిగే అలంకరణ, పూల మొక్కలు నాటుకోవడం ఉత్తమమనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం.. ప్రజలకు ఇబ్బందికరం..

బైంసా, న్యూస్‌టుడే: పట్టణ శివారు కాలనీల్లో పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఎక్కడ పడితే అక్కడ చెత్త దర్శనమిస్తోంది. కాలువల నిర్వహణ సకాలంలో చేపట్టక పూడికతో నిండిపోయి మురుగు రహదారులపైకి చేరుతోంది. ఏపీనగర్‌లోని ఎస్సీ బాలుర వసతిగృహం ప్రహరీ పొడవునా రహదారి పక్కన చెత్త పేరుకుపోతోంది. గోపాల్ నగర్, ఏపీనగర్, శాస్త్రీనగర్, ఎన్‌బీ కాలనీల్లో పలు చోట్ల కాలువలు లేక మురుగు రహదారిపై ప్రవహిస్తోంది. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాలు బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో ఈ ప్రాంతంలో పలువురు డెంగీ బారిన పడ్డట్లు వారు గుర్తు చేశారు. తాజాగా శనివారం గోపాల్‌నగర్‌కు వెళ్లే మార్గంలోని కాలువలు పూడుకు పోయి హనుమాన్ ఆలయం చుట్టూ మురుగు చేరడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయమై పుర కమిషనర్ బి.రాజేశ్ కుమార్‌ను వివరణ కోరగా రోజువారి పారిశుద్ధ్య పనులు క్రమం తప్పకుండా చేపడుతున్నాం. ఎక్కడైనా సమస్యలు ఉంటే ప్రజలు తమ దృష్టి తీసుకురావాలి. వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


రహదారి పక్కన పేరుకుపోతున్న చెత్త

యువకుడి ఆత్మహత్య


రాజేశం

జన్నారం: దస్తురాబాద్ మండలం మున్యాల్ గ్రామానికి చెందిన యెమునూరి రాజేశం (27) మద్యానికి బానిసై మంచిర్యాల జిల్లా కలమడుగు గోదావరి వంతెన వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జన్నారం ఎస్సై-2 రాథోడ్ తానాజీ తెలిపిన వివరాల ప్రకారం... రాజేశం కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. వడ్రంగి పనులు చేసేందుకు అడ్వాన్స్ తీసుకొని పనులు చేసేవాడు కాదు. డబ్బులు వెనక్కి ఇవ్వాలని ఇంటికి వచ్చి అడిగే వారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన రాజేశం బుట్టాపూర్‌లోని బంధువుల ఇంట్లో శుక్రవారం ఉన్నాడు. తిరిగి శనివారం అక్కడి నుంచి వెళ్లిన అతను మధ్యాహ్నం కలమడుగు గోదావరి వంతెన వద్ద పురుగు మందు తాగాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళలకు అండ

ఖానాపూర్: ఇందిరా మహిళా శక్తి పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల యూనిట్ బ్యూటిపార్లర్‌ను శనివారం మున్సిపల్ ఛైర్మన్ చిన్నం సత్యం ప్రారంభించారు. స్వశక్తితో మహిళలు ఎదిగేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. అంతకుముందు ఆయా బ్యాంకు మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు శంకర్, సురేష్, అమానుల్, కిశోర్, కమిషనర్ మనోహర్, మెప్మా పీడీ సుభాష్, ఆయా బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


దశలవారీగా గ్రామీణ రహదారుల అభివృద్ధి


కుభీరులో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్, నాయకులు

కుభీరు, న్యూస్‌టుడే: గ్రామీణ రోడ్లను దశలవారీగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. కుభీరు నుంచి మహారాష్ట్ర సరిహద్దు టంబ వరకు రూ.4.5 కోట్లతో చేపట్టిన రహదారి అభివృద్ధి పనులకు శనివారం భూమిపూజ చేశారు. పనులు నాణ్యతగా చేపట్టాలని పర్యవేక్షణాధికారులు, గుత్తేదారులకు సూచించారు. అనంతరం కుభీరు తహసీల్దార్ కార్యాలయంలో 120 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను నాయకులు, అధికారులతో కలిసి పంపిణీ చేశారు. కుభీరులో రెండురోజులుగా సోయా కొనుగోళ్లు నిలిపివేశారని రైతులు, నాయకులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ సోము, ఎంపీడీఓ నవనీత్‌కుమార్, నాయకులు సాంల్లీ రమేష్, బోయిడి విఠల్, వడ్నం నగేశ్, ప్యాట లక్ష్మణ్, వి.మోహన్, ఏశాల దత్తాత్రి, పి. గంగాధర్ పాల్గొన్నారు.

బైంసా: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వెనువెంటనే అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. పట్టణంలో శనివారం 297మంది లబ్ధిదారులకు చెక్కులను అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెళ్లి కూతురుకు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంఐఎం కౌన్సిలర్లు పట్టణ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తామన్నారు.

వెలుగు నీడల సహ్యాద్రి కొండ


సహ్యాద్రి కొండలపై ఓవైపు నీడ, మరోవైపు ఎండ

కడెం, న్యూస్‌టుడే: వాతావరణంలోని మార్పులు కనువిందు చేసే దృశ్యాలను ఆవిష్కృతం చేస్తున్నాయి. కడెం జలాశయాన్ని ఆనుకుని ఉన్న సహ్యాద్రి కొండలపై వాలినట్లు కనిపించే మేఘాలకు సూర్యకాంతి అడ్డువచ్చిన చోట పడే నీడతో సహ్యాద్రి పర్వతాలు వెలుగు నీడలతో ఆకట్టుకునేలా కనిపించాయిలా. కొండలపై అక్కడే ఎండ, ఆ పక్కనే నీడతో చూపరులను ఆకట్టుకున్నాయి.

హక్కుల సాధనే ధ్యేయం

కడెం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతోపాటు హక్కుల సాధనకు ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం పనిచేస్తుందని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు బి.రాజేష్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల నుంచి సంఘ సభ్యత్వం నమోదు చేయించారు

దస్తూరాబాద్: మండల కేంద్రంలోని వివిధ పాఠశాలల్లో శనివారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నూతన ఉపాధ్యాయుల నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్య రాజేష్‌నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్‌లు హాజరయ్యారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలకే పంపండి

కడెం: అన్ని వసతులు ఉండే ప్రభుత్వ పాఠశాలలకే తమ పిల్లలను పంపించాలని కొత్తమద్దిపడిగ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శైలేందర్ పేర్కొన్నారు. శనివారం గ్రామస్థులు కొత్తగా వచ్చి బాధ్యతలు స్వీకరించిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ప్రధానోపాధ్యాయునితోపాటు ఉపాధ్యాయులు విజయ్ కుమార్, రవి, దీపికలను గ్రామస్థులు దళ్లె వెంకటేష్, కిష్టయ్య, పోషం, గంగాధర్, రాజన్న, రాములు తదితరులు సత్కరించారు.

బాక్సింగ్‌లో మరింతగా రాణించాలి


అభినయను సన్మానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

లక్ష్మణచాందా: బాక్సింగ్‌లో మరింతగా రాణించి దేశ కీర్తి తీసుకురావాలని విద్యార్థి పుట్టి అభినయను డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అభినందించారు. మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామానికి చెందిన పదోతరగతి విద్యార్థిని అభినయ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన బాక్సింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో రజతం గెలిచింది. శనివారం నిర్మల్‌లోని శ్రీహరిరావును ఆమెను సన్మానించారు. మార్కెట్ ఛైర్మన్ భీంరెడ్డి, వైస్‌ఛైర్మన్ ఈటెల శ్రీనివాస్, నాయకులు నరేష్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.


సోయాను పరిశీలిస్తున్న మార్కెట్ ఛైర్మన్ అబ్దుల్‌హాది, ఏవో వికర్‌అహ్మద్

కొనుగోళ్లలో వేగం పెంచాలి

సారంగాపూర్, న్యూస్‌టుడే: సోయాబీన్ పంట కొనుగోళ్లలో మరింత వేగాన్ని పెంచాలని మార్కెట్ కమిటీ ఛైర్మన్ అబ్దుల్‌హాది అన్నారు. శనివారం ఏవో వికర్‌అహ్మద్‌తో కలిసి స్థానిక మార్కెట్ యార్డులోని సోయా రాసులను పరిశీలించారు. కొనుగోళ్లు నెమ్మదించడంపై ఆరా తీశారు. తగినంత తేమశాతంతో నాణ్యమైన సోయాను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని వ్యవసాయాధికారి రైతులకు సూచించారు. ఆన్‌లైన్ ఇబ్బందులు ఉంటే సంబంధిత ఏఈవోలను సంప్రదించాలన్నారు. మార్కెట్ కార్యదర్శి దూమడనాయక్, ఏఈవోలు అరుణ్, లక్ష్మి, సుప్రియ పాల్గొన్నారు.

డీఎల్పీఓ విచారణ

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదానికి కారకుడైన బాసర పంచాయతీ ఈఓ గోవింద్‌రాజుపై విచారణ జరపాలని కలెక్టర్ అభిలాష అభినవ్ భైంసా డీఎల్పీఓ సుదర్శన్‌పటేల్‌ను ఆదేశించారు. దీంతో ఆయన శనివారం గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి సిబ్బందితో పాటు ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ గంగాసింగ్‌తో మాట్లాడి వివరాలను సేకరించారు. పోలీస్ కేసు నమోదు కావడంతో అక్కడికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై సోమవారం కలెక్టర్‌కు విచారణ నివేదికను అందజేయనున్నారు.

పేదింటి నేపథ్యం.. కల సాకారం

కడెం, న్యూస్‌టుడే: అనుకున్నది సాధించాలంటే ముందు లక్ష్యం నిర్దేశించుకోవాలి.. ఆతర్వాత నిర్విరామంగా కృషి చేయాలని ఇటీవలి డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన యువత అభిప్రాయపడ్డారు. కడెం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వీరు ఉపాధ్యాయ ఉద్యోగాలను సాధించి విధుల్లో చేరిన సందర్భంగా కథనం..

పోలీసు నుంచి ఉపాధ్యాయ వృత్తికి..



అంబారిపేటకు చెందిన అల్లంల మల్లేష్, నర్సవ్వల కుమారుడు భాస్కర్ 2018లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించారు. ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో అవకాశం కోసం ఎదురు చూశారు. డీఎస్సీలో ప్రతిభ కనబరిచి ఉద్యోగం సాధించారు. దస్తురాబాద్ మండలం ఆకొండపేట పాఠశాలలో విధుల్లో చేరారు. ఈయన తమ్ముడు మహేష్ సైనికుడిగా ఉద్యోగం చేస్తున్నారు.

కూలీ కుటుంబం నుంచి..



పెద్దూరుకు చెందిన కూలీ పనిచేసి కుటుంబాన్ని పోషించే కల్లెపాక చిన్న గంగన్న, శంకరవ్వ దంపతుల కుమారుడు రాజ్‌కుమార్ డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ విభాగంలో జిల్లాలో 8వ ర్యాంకు సాధించారు. దస్తురాబాద్ మండలం దేవునిగూడెం పాఠశాలలో విధుల్లో చేరారు. ప్రస్తుతం ఈయన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ చేస్తున్నారు.

అన్నదమ్ములు అనుకున్నది సాధించారు..




కడెం మండలం కల్లెడకు చెందిన దొనికెని సాయికృష్ణ, ఓంసాయి అన్నదమ్ములు. వీరి తల్లి దండ్రులు దుబ్బయ్య, లక్ష్మీలు ఉన్నకొద్ది భూమిలో వ్యవసాయం, కుల వృత్తి చేసుకుంటూ పిల్లలను చదివించారు. వారి కష్టాలను చూసిన ఇద్దరు కుమారులు, కూతురు చక్కగా చదివారు. చిన్న కుమారుడు ఓంసాయి మొదట ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికై మొన్నటివరకు పోలీసు ఉద్యోగం చేశారు. రెండో ఉద్యోగంగా ఎస్జీటీ సాధించి పక్క గ్రామం అంబారిపేట పాఠశాలలో ఉద్యోగంలో చేరారు. సాయికృష్ణ కూడా ఎస్జీటీ ఉద్యోగం సాధించి మండలంలోని మొర్రిగూడలో విధుల్లో చేరారు.

కార్యదర్శిగా పనిచేసిన గ్రామంలోనే ఉపాధ్యాయుడిగా..



పెద్దూరుకు చెందిన చిటేటి ముత్తన్న దంపతుల రెండో కుమారుడు నరేష్ 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఎంపికయ్యారు. మండలంలోని పాతమద్దిపడిగ కార్యదర్శిగా కొనసాగుతూనే డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంటు విభాగంలో జిల్లాలో రెండో ర్యాంకు(సోషల్) సాధించాడు. ఉద్యోగ నియామకంలో ఆయనకు పాతమద్దిపడిగ ఉన్నతపాఠశాలనే కేటాయించడంతో కార్యదర్శిగా పనిచేసిన గ్రామంలోనే ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

చదువుకు ప్రోత్సాహం తోడై..



అల్లంపల్లికి చెందిన రాధ, రాంరెడ్డి కూతురు సింగిరెడ్డి రజిత అల్లంపల్లిలోని జీయరు గురుకులంలో పది వరకు చదివారు. ఇంటర్, డిగ్రీ, డీఈడీ ఇతర కళాశాలల్లో పూర్తిచేసి 2019లో పెళ్లి చేసుకున్నారు. తల్లిదండ్రులు చదివించగా పెళ్లి అనంతరం భర్త విజయ్ సైతం ప్రోత్సహించడంతో ఇటీవలి డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ ఉద్యోగం సాధించారు.

సైకిల్ మెకానిక్ కూతురు..



కడెం(పెద్దూరు)కు చెందిన మహమ్మద్ బబ్లూ రెహన దంపతుల కూతురు ఫర్హానా నాజ్నీన్ ఎస్జీటీగా నియామకమయ్యారు. కుభీరు మండలంలో ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. తండ్రి కడెంలో సైకిల్ మెకానిక్‌గా పనిచేస్తూ కూతుళ్లను చదివిస్తున్నారు. రెండో అమ్మాయి బీటెక్, మూడో అమ్మాయి ఇంటర్ చదువుతున్నారు. తండ్రి మెకానిక్‌గా పడుతున్న కష్టానికి ఫలితంగా కూతురు ప్రభుత్వ కొలువు సాధించడం పట్ల పలువురు అభినందించారు.

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: రవాణాశాఖ అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తుండటంతో విద్యార్థుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని ఏబీవీపీ ఇందూరు విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ విమర్శించారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రైవేటు పాఠశాల బస్సులు కొన్ని సరైన సామర్థ్యం లేకుండా తిప్పుతున్నారని, అధికారుల తనిఖీలు- పర్యవేక్షణ లేకపోవడంతో ఇది ప్రమాదాలకు కారణంగా మారుతోందన్నారు.


భైంసా: శోభాయాత్రలో కోలాటం


భైంసా: శారదాదేవి శోభాయాత్రలో అతివల సందడి


ఖానాపూర్ గ్రామీణం: స్వామి వారికి నాగవెల్లి జరిపిస్తున్న వేద పండితులు

శారదాదేవి నిమజ్జనం

బైంసా: పట్టణంలోని బ్రాహ్మణ, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో మహిళలు ప్రతిష్ఠించిన శారదాదేవి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. మధ్యాహ్నం ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన శోభాయాత్ర ప్రారంభించారు. పురాణబజార్ మీదుగా కొనసాగిన శోభాయాత్రలో కోలాటలు, నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ సందడి చేశారు. అనంతరం గడ్డెన్న జలాశయం వద్ద నిమజ్జనం చేశారు. అంతకు ముందు మండపాల నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

ఆధ్యాత్మికం

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

ఖానాపూర్ గ్రామీణం: మండలంలోని సుర్జాపూర్ శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. వేదపండితుల ఆధ్వర్యంలో నాగవెల్లి, ఉద్వాసన బలి, గ్రామ బలి, స్వామి వారి హెచ్చరికలు, తదితర పూజలు నిర్వహించారు. గ్రామస్థులు, భక్తులు, ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేవరకోట ఆలయంలో పూజలు

నిర్మల్: పట్టణంలోని పురాతన శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి (దేవరకోట) ఆలయంలో శనివారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారిని ఆలయ కమిటీ ఛైర్మన్ కొండా శ్రీనివాస్ దంపతులు సన్మానించారు. మార్కెట్ ఛైర్మన్ సోమ భీంరెడ్డి, వైస్ ఛైర్మన్ ఈటల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు నాందేడపు చిన్ను, నాయకులు పాల్గొన్నారు.

డీపీవో సమీక్ష సమావేశం

ఖానాపూర్: పట్టణంలో ఖానాపూర్, పెంబి మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, పరిశ్రమల శాఖల మేనేజర్ నర్సింహరెడ్డి, లీడ్ బ్యాంక్ ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులతో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకొనే అభ్యర్థులు మొదటి నుంచి అదే పని చేసినవారై ఉండాలని సూచించారు. గ్రామపంచాయతీల్లో ఈ నెలలో 50 శాతం ఇంటి పన్నువసూలు చేయాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ఆన్‌లైన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు.

నేటి విలీన సభను విజయవంతం చేయండి

నిర్మల్ అర్బన్: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించనున్న ట్రేడ్ యూనియన్ సెంట్రల్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ)లో ఐఎఫ్‌టీయూ విలీన సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న కోరారు. శనివారం నిర్మల్‌లో గోడప్రతులు ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు గంగామణి, లక్ష్మి, విజయ, కవిత, తస్రీన్, కమల, రుక్మ పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులను అరికట్టాలి: వీహెచ్‌పీ


నిర్మల్: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: హిందూ పండగలు, ఆలయాలపై పెరుగుతున్న మతోన్మాదుల దాడులను అరికట్టేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ విఠల్ డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా పాలనాధికారి కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లో ముత్యాలమ్మ ఆలయంలోకి చొరబడిన దుండగుడు విగ్రహాన్ని ధ్వంసంచేశారన్నారు. ఇలాంటి ఘటనలు చూస్తుంటే హిందూ విశ్వాసాలను కావాలని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. నాయకులు పతికె రాజేందర్, మూర్తి ప్రభాకర్, చింతకుంట శ్రీనివాస్, ద్యాగరి సిరి, ముప్పిడి రవి, సురేశ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బైంసా: హిందూ ఆలయాలపై దాడులను అరికట్టాలని వీహెచ్‌పీ నాయకులు కోరారు. శనివారం ఆర్డీవో కోమల్‌రెడ్డి, ఏఎస్పీ అవినాశ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. నాయకులు గుజ్జుల్‌వార్ వెంకటేశ్, పెరుగు నవీన్, శివకుమార్, గోపి, సంతోశ్, రంగు శ్రీనివాస్, పెండెపు కాశీనాథ్, శ్రీకాంత్, పోశెట్టి, నరేశ్, రాజన్న, గోపాల్ సుత్రావే, గంగాధర్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: హిందూ దేవాలయాలపై దాడులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు శనివారం తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. వీహెచ్‌పీ రాష్ట్ర సహ కార్యదర్శి ఘణపురం రాజేశ్వర్, భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ, హిందూ ఉత్సవసమితి నాయకులు ఎం.సురేష్, కె. ప్రణయ్‌కుమార్, ప్రభాకర్, రాకేష్, రాజేశ్వర్, భూమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

‘నియామక ఉత్తర్వుల జారీలో జాప్యమేల?’

నిర్మల్ అర్బన్: కుంటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక నియామక ఉత్తర్వుల జారీలో జాప్యం సరికాదని అభ్యర్థులు అన్నారు. శనివారం నిర్మల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారని, ఎంపికైన వారు 17న కళాశాలలో విధుల్లో హాజరుకావాల్సి ఉండగా ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదని పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

సౌండ్ సిస్టం బహూకరణ

కుభీరు: మండలంలోని పార్డి(బి) ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ పదోన్నతిపై వెళ్లిన కాశిరెడ్డి మాలతి రూ.18 వేలు విలువచేసే సౌండ్ సిస్టంను శనివారం ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డికి బహూకరించారు.

ఉపకరణాల పంపిణీ

కడెం: మండలంలోని ఎలగడప ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన నిర్మల్‌లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు బిక్షపతి నాయక్ శనివారం ఆటవస్తువులతో పాటు చదువుకునేందుకు ఉపకరించే పరికరాలు అందజేశారు. తాను పుట్టి పెరిగిన గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు చదువుకునేందుకు ప్రోత్సాహకంగా ఇవి అందజేశానన్నారు. ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాస్, నాయకులు రమేష్, భూమరాజం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల తనిఖీ

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా మాధ్యమిక అధికారి జాదవ్ పరశురామ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరుకావాలని సూచించారు. ప్రతీ విద్యార్థికి 75 శాతం హాజరు తప్పనిసరి అని తెలిపారు. అనంతరం కళాశాల దస్త్రాలను పరిశీలించారు. ప్రిన్సిపల్ హమీద్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. చేపట్టాల్సిన పనులపై తీర్మానం చేశారు. ఎంపీడీఓ తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కైలాస్‌రాథోడ్, టీఏ సతీష్, ఫీల్డ్ అసిస్టెంట్ విఠల్, కాంగ్రెస్ నాయకులు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, అజీం, ఉమామహేశ్వర్, మాజీ సర్పంచి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

కుభీరు: మండలంలోని చొండి, గొడిసెర, పాంగ్ర పాఠశాలలను మండల విద్యాధికారి ఆర్.విజయ్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. తరగతిగదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ప్రేరణ పొందేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

భగీరథ లీకేజీని నివారించాలి

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ఏర్పడిన నీటి లీకేజీని సత్వరమే పరిష్కరించాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఓస రాజేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ ఈటల శ్రీనివాస్ అన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. శనివారం లీకేజీ ప్రాంతాన్ని పరిశీలించారు.

కల్లు బట్టీలను తొలగించండి

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలో జనావాసాల్లో అమ్ముతున్న తెల్లకల్లు బట్టీలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి కైలాస్ రాథోడ్‌కు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. వీధుల్లో కల్లు తాగిన వ్యక్తులతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

పిల్లలపై దృష్టి సారించాలి

తానూరు(భైంసా): విద్యార్థుల తల్లిదండ్రులు ఇంటి వద్ద తమ పిల్లలపై దృష్టి సారించాలని ఎంఈవో బాశెట్టి నరేందర్ అన్నారు. తానూరు మండలం ఎల్వి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోషకుల సమావేశంలో తల్లిదండ్రులకు సూచనలు చేశారు. క్రమం తప్పకుండా బడికి వచ్చేలా చూడాలని, రోజువారీగా అభ్యాసన, రాత పుస్తకాలను పరిశీలించాలన్నారు.

తొలి ఎంపీపీ మృతి


జాదవ్ గంగాధర్‌రావు పటేల్

తానూరు(భైంసా): తానూరు మండలం తొలి ఎంపీపీ జాదవ్ గంగాధర్‌రావు పటేల్ శనివారం మృతి చెందారు. మండల వ్యవస్థ ఏర్పాటయ్యాక 1986లో జరిగిన మండల ప్రజా పరిషత్తు ఎన్నికల్లో ఆయన తెదేపా నుంచి పోటీ చేసి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అప్పట్లో అధ్యక్షుడిని ఓటర్లు నేరుగా ఎన్నుకునేవారు. అయిదేళ్లపాటు మండల ప్రజలకు సేవలందించిన ఆయన తరువాత రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

మాజీ సర్పంచి..

ముథోల్: మండలంలోని కారేగాం మాజీ సర్పంచి మోనగారి గంగవ్వ (70) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం

ఖానాపూర్ గ్రామీణం: మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో శనివారం వీడీసీ ఆధ్వర్యంలో నూతన ఉపాధ్యాయులు కిషన్, చందన, షఫీ, విజయ్ కుమార్, సయ్యద్ ఫరాజ్, లక్ష్మణ్ రావులను సన్మానించారు. వీడీసీ సభ్యులు శంకర్, స్వామి, ఎర్రన్న, లక్ష్మణ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దొనికెని దయానంద్, ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్, శేఖర్, శ్రీనివాస్, అంజయ్య, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ముథోల్: బ్రాహ్మణ్‌గావ్ ఫీడర్ లైన్‌మెన్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీమన్‌నారాయణ, లైన్ ఇన్స్‌పెక్టర్ బాసీద్‌లను శనివారం ఎంపీటీసీ మాజీ సభ్యుడు సతీష్‌రెడ్డి, ఆష్టా గ్రామ భాజపా నాయకులు సన్మానించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి మాజీ ఉప సర్పంచి దొడ్డికింది గంగాధర్ కుమారుడు శ్రీకాంత్ వారం రోజుల కిందట గుండెపోటుతో మరణించారు. శ్రీకాంత్‌తో కలిసి చదువుకున్న యువతరంగ్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులతో పాటు స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూపు సభ్యులు రూ.75,500 పోగు చేసి గంగాధర్‌కు శనివారం అందజేశారు.

ఆశా కార్యకర్తలకు రిజిస్టర్ల పంపిణీ


నిర్మల్ అర్బన్: ప్రభుత్వం ఆశా కార్యకర్తల కోసం రూపొందించిన ప్రత్యేక రిజిస్టర్లను జిల్లా వైద్యాధికారి రాజేందర్ పంపిణీ చేశారు. శనివారం కలెక్టరేట్‌లో వీటిని అందజేసి మాట్లాడారు. 17 అంశాలకు సంబంధించినవి ఇందులో పొందుపర్చారని చెప్పారు. ఒక్కొక్కరికి అయిదు చొప్పున ఇవ్వనున్నట్లు వెల్లడించారు. డా.సౌమ్య, డా.రవీందర్, సాయమ్మ పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ సీతారామ చంద్రస్వామి ఆలయం చెంత వీహెచ్‌పీ రాష్ట్ర సహ కార్యదర్శి ఘణపురం రాజేశ్వర్ ఆధ్వర్యంలో విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు శనివారం సత్యపాన సమావేశం నిర్వహించారు.

22న సంచార జాతుల సమావేశం

నిర్మల్: ఈనెల 22న సంచార జాతుల కులస్తుల సమావేశం కలెక్టరేట్‌లోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ కార్యాలయంలో ఉంటుందని జిల్లా బీసీ సంక్షేమాధికారి డి.శ్రీనివాస్ తెలిపారు. సంచార జాతుల సంక్షేమ సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

జాతీయ యోగా పోటీలకు ఇలేగాం విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఆర్డీవో కోమల్‌రెడ్డి, ఏఎస్పీ అవినాశ్ కుమార్

బైంసా, న్యూస్‌టుడే: ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో జిల్లా నుంచి పాల్గొన్న ఇలేగాం విద్యార్థులు ఎ.మనస్వి, ఎన్.మధుప్రియ ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా యోగాసన్, స్పోర్ట్ అసోసియేషన్ కార్యదర్శి ఉప్పు రవీందర్ తెలిపారు. ఈ నెల 24న హిమాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొననున్నారని చెప్పారు. శనివారం విద్యార్థులను ఆర్డీవో కోమల్‌రెడ్డి, ఏఎస్పీ అవినాశ్ కుమార్, సీఐ గోపీనాథ్ అభినందించారు. యోగా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాటి పోతన్న, శిక్షకులు గంగాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.